పొంచి ఉన్న ప్రమాదం

- మార్కెట్ ప్రవేశ ద్వారం వద్ద డ్రైనేజీ గుంత
- పూడ్చివేతపై కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- అవస్థలు పడుతున్న వ్యాపారులు


మలక్‌పేట మార్కెట్ ప్రవేశ ద్వారం వద్ద ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ గుంత

చాదర్‌ఘాట్: మలక్‌పేట మార్కెట్‌కు వచ్చిపోయే వారికి ప్రవేశంలోనే ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆరు నెలలుగా అక్కడ ఉన్న డ్రైనేజీ గుంతతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్లు మార్చే క్రమంలో తీసిన గుంతను కాంట్రాక్టర్ పూడ్చకుండానే వదిలేశాడు. ఈ సమస్యను మార్కెట్ వ్యాపారులు అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పరిష్కరించడం లేదు. మార్కెట్ అధికారులను అడిగితే ఆ పని జీహెచ్‌ఎంసీ అధికారులు చేయించాలని చెప్తున్నారని, జీహెచ్‌ఎంసీ అధికారులను అడిగితే మార్కెట్ అధికారులే చేయాలని చెప్పి తప్పించుకుంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు. ప్రవేశ ద్వారం వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చటంలో అధికారులు తాత్సారం చేయడంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

మట్టి రోడ్లే దిక్కు!

- సీసీ రోడ్లకు నోచుకోని నగర శివారు కాలనీలు
- రాకపోకలకు జనం అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


బండ్లగూడ ఆనందర్‌నగర్‌లో మట్టి రోడ్డు

నాగోలు: నగర శివార్లలో శరవేగంగా విస్తరిస్తున్న కాలనీల్లో సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ నాగోలు డివిజన్ పరిధిలోని పలు కాలనీలో రోడ్లు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో రాత్రి సమయంలో వాహనదారులు కింద పడి గాయాల పాలవుతున్నారు.

◆ డివిజన్‌లోని హనుమాన్‌నగర్, బండ్లగూడ పరిధిలోని ఆనందర్‌నగర్, ఇంద్రప్రస్థ కాలనీలోని కొన్ని రోడ్లు, అయ్యప్ప నగర్ కాలనీ, మల్లికార్జునగర్, ఫతుల్లాగూడ పరిధిలోని పలు కాలనీ సీసీరోడ్లు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

◆ హనుమాన్‌నగర్ కాలనీలో దాదాపు ఏడాది క్రితం సీసీరోడ్లు నిర్మాణం కోసం రోడ్లు తవ్వి నిర్మాణం మాత్రం పూర్తి చేయలేదు. ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ అధికారులకు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ వర్షం వస్తే కాలనీలో నడవ లేని పరిస్థితి ఉంటోందని వాపోతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నాగోలు డివిజన్‌లోని పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


అయ్యప్పనగర్ కాలనీలో కంకర తేలిన రోడ్డు


ఇంద్రప్రస్థ కాలనీలోని రోడ్డు

కార్మికులు సక్రమంగా చెత్తను తరలించాలి


కమలానగర్ వాసులతో మాట్లాడుతున్న ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: స్వచ్ఛ ఆటో కార్మికులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని కమలానగర్ కాలనీలో ఇళ్లలోని చెత్తను తీసుకెళ్లేందుకు స్వచ్ఛ ఆటో కార్మికులు రావటంలేదని కాలనీవాసులు ఫిర్యాదు చేయటంతో శానిటేషన్ అధికారులతో కలిసి ఆయన కాలనీలో పర్యటించారు. ఆటో కార్మికులు రాకపోవటంతో చెత్త పేరుకుపోతున్నదని కార్పొరేటర్ అన్నారు. విధులపై నిర్లక్ష్యం చేసిన చెత్త ఆటో కార్మికులపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ బుచ్చయ్యకు సూచించారు. ఇదే విషయాన్ని డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. కార్పొరేటర్ వెంట శానిటేషన్ సిబ్బంది కాలనీవాసులు సత్యనారాయణరెడ్డి, సీవీ సత్యనారాయణ, దేవరాజ్ తదితరులు ఉన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం: ఉప్పల


యోగా తరగతుల కరపత్రాలను విడుదల చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

నాగోలు: ఆరోగ్యమే మహాభాగ్యమని, అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సత్య సాయి ధ్యానమండలికి చెందిన భిక్షమయ్య గురూజీ నిర్వహించే ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణ తరగతులు ఈనెల 21వ తేదీ నుంచి ఎల్బీనగర్‌లోని చిత్రాలే అవుట్ లో, 23 నుంచి హస్తినాపురంలోని పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్‌లో, 25 నుంచి దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో ప్రారంభం కానున్నాయి. ఈ శిక్షణ తరగతుల కరపత్రాలను బుధవారం నాగోలులోని తన నివాసంలో ఉప్పల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగ సాధనతో మనిషి ఎటువంటి అనారోగ్యం లేకుండా జీవితాన్ని గడపవచ్చన్నారు. ప్రస్తుత తరుణంలో మానసిక ఒత్తిళ్ల తో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి ఇది ఒక గొప్ప ఔషధమని అన్నారు. యోగా శిక్షణను పూర్తిగా ఉచితంగా ఇస్తున్నామని యోగా గురువు ఇస్మాయిల్ గురూజీ తెలిపారు. కార్యక్రమంలో జాగృతి అభ్యుదయ సంఘం భావన శ్రీనివాస్, ఎస్‌ఆర్‌ఆర్ చారిటబుల్ ఫౌండేషన్ లయన్ రామచంద్రరావు, తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి బూర మల్సూర్ గౌడ్, యోగా మాస్టర్ శ్రీనివాసులు, నరేందర్ గురూజీ తదితరులు పాల్గొన్నారు. శిక్షణలో పాల్గొనేవారు 9603256572 ను సంప్రదించాలన్నారు.

22న శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

సైదాబాద్: అయోధ్యలో ఈనెల 22న బాల రాముని ప్రతిష్టిస్తున్న అమృత ఘడియల్లోనే సైదాబాద్ భక్తసమాజంలో శ్రీరామ చంద్రుల పాదుకా పట్టాభిషేకం వైభవంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ వైఎస్ ఆర్ మూర్తి తెలిపారు. బుధవారం ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆలయంలో కొలువై ఉన్న సీతారామ చంద్రుల సమక్షంలో ఈనెల 22న ఉదయం శ్రీరామ జపం, రామ భజనలు, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి పాదుకా పట్టాభిషేకం జరుగుతుందన్నారు. ఈ పూజలో పాల్గొనదలచిన భక్తులు ఈనెల 21లోపు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. భక్తులకు పూజా ద్రవ్యాలను ఆలయ కార్యకర్తలతో ఏర్పాటు చేయిస్తామని, మరిన్ని వివరాలకు ఫోన్ నం. 9849569626లో సంప్రదించాలన్నారు.

కిటికీలోంచి చొరబడి సెల్‌ఫోన్ చోరీ

చైతన్యపురి: రాత్రి వేళ కిటికీ లోంచి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు సెల్‌ఫోన్ అపహరించుకెళ్లిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కోదండ రాంనగర్ కాలనీలో ఉద్యోగి శంకర్‌సింగ్ నివసిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో నిద్రలేచిన కుటుంబ సభ్యులు కిటికీ తెరిచి ఉండగా గమనించారు. సెల్‌ఫోన్ కనిపించకపోవటంతో దొంగలు ఇంట్లో జొరబడినట్లు గుర్తించారు. బుధవారం ఉదయం శంకర్‌సింగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కాలనీలోని సీసీ కెమెరా ఫుటేజీను పరిశీలించగా ముగ్గురు అగంతకులు బైక్‌పై కాలనీలో సంచరించినట్లు రికార్డయింది. ఇంటి నుంచి ఓ బస్తాతో బయటకు వెళ్లి బైక్‌పై పరార్ అయినట్టు సీసీ కెమెరా ఫుటేజీలో కనిపించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది రోజుల క్రితం కూడా....

పది రోజుల క్రితం కూడా కోదండరాంనగర్ కాలనీలో రాత్రి సమయంలో ఓ కిరాణా దుకాణం యజమాని ఇంట్లోకి గోడ దూకి ఇద్దరు అగంతకులు చొరబడ్డారని స్థానికులు తెలిపారు. ఇంట్లో వారు మెలకువగా ఉండటం, అలికిడి కావడంతో అగంతకులు పరారైనట్టు తెలిపారు. వరుస ఘటనల నేపథ్యంలో రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 28, బెండ 35, పచ్చి మిర్చి 45, కాకర 55, బీర 40, క్యాబేజి 23, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 45, దొండ 28–35, చిక్కుడు 23–45, గోకర 50, బీట్‌రూట్ 19, క్యాప్సికం 55, ఆలు 18–23, దోస 28, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 60 గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని దిగువ తెలిపిన ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

◆ **ఉదయం 9 నుంచి 11 గంటల వరకు...**
యూనిక్ స్కూల్, కాకా హోటల్ ఎదురు లేన్, బిలాల్ మసీద్, అగ్రికల్చర్ 500 కేవీఏ, షాలిన్ మసీద్, రామ్ మందిర్, దుర్గా మాతా మందిర్ పరిసర ప్రాంతాలు

◆ **ఉ. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...**
అరుంధతి కాలనీ, జమాల్ కాలనీ, మొయిన్ బాగ్, రియాసత్ నగర్, పిసల్‌బండ క్రాస్ రోడ్స్, పెట్రోల్ పంప్, అమీన్ మసీద్ పరిసరాలు.

◆ **మ. 2 నుంచి సా. 4 గంటల వరకు...**
అన్‌మోల్ హోటల్, షహసాద్, జోరాబీ దర్గా పరిసర ప్రాంతాలు

◆ **సా.4 నుంచి 6 గంటల వరకు...**
సమీనా హాస్పిటల్, దోభీఘాట్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని అధికారులు చెప్పారు.

20న జైపురికాలనీలో ర్యాలీ

నాగోలు: అయోధ్యలో ఈ నెల 22న బాల రాముని నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా నాగోలు డివిజన్ జైపురి కాలనీలో ఈనెల 20న ర్యాలీ నిర్వహిస్తామని జైపురి కాలనీలోని హనుమాన్ వ్యాయామ శాల సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాలనీలోని సాయిబాబా ఆలయం నుంచి కర్మన్‌ఘాట్‌లోని హనుమన్ ఆలయం వరకు 20 తేదీన ఉదయం 6 గంటలకు ర్యాలీ నిర్వహిస్తామని, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కేంద్ర పథకాలతో పేదలకు ఎంతో మేలు


వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ తదితరులు

చంచల్‌గూడ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలు బడుగు, బలహీన వర్గాల వారికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ కె. సహదేవ్‌యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' నిర్వహించారు. ఈ సందర్భంగా సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ, దేశంలో గత 60 సంవత్సరాలుగా జరగని అభివృద్ధి, మోదీ పాలనలో 9 ఏళ్లలో సాధించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ పథకంలో కేంద్రం వాటా ఉందన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ మేళాకు విశేష స్పందన


హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైను దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు కాలనీల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, చెప్పులు, గాజులు, ఇతర ఉత్పత్తులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని, పండుగల సందర్భంగా తగ్గింపు ధరల్లో లభిస్తాయని మేళా నిర్వాహకులు అక్బర్‌అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


నింబోలిఅడ్డాలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డాలో రూ. 31 లక్షల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను, రూ. 1.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆధునికీకరించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి, సీవరేజ్ సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుతో మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జలమండలి మేనేజర్ షాకీర్, బీఆర్‌ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్‌నాగేందర్ బాబ్జీ, బద్దుల ఓంప్రకాష్ యాదవ్, సరిత, ప్రతిభ, లావణ్య, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, కృష్ణ కుమార్, మల్లికార్జున్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మరోసారి అధికారం బీజేపీదే: గౌతంరావు


మాట్లాడుతున్న డాక్టర్ గౌతంరావు

కాచిగూడ: ప్రతి ఇంటా జనవరి 22వ తేదీన దీపావళి పండగలా సంబరాలు జరుపుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు పిలుపునిచ్చారు. బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం ఎంతో మంది త్యాగాలు చేశారన్నారు. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించడంతో హిందువుల కోరిక నెరవేరిందని గౌతమ్‌రావు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు దేవాలయాలను శుభ్రం చేయాలని ఆయన కోరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని గౌతంరావు ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు శ్యామ్‌సుందర్ గౌడ్, నాగూరావు నమోజీ, వీరెల్లి చంద్రశేఖర్, కృష్ణగౌడ్, మేకల సారంగపాణి, పవన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణ యజ్ఞం


లక్ష్మీగణపతి ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని లక్ష్మీగణపతి దేవస్థానంలో సుందరకాండ పారాయణ యజ్ఞాన్ని ఈ నెల 22 వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ యజ్ఞం జరుగుతోంది. ఇందులో భాగంగా బుధవారం భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణం యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ డి.అశోక్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్లు మిట్టా రాంమోహన్, కంచి కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి డా.వి.ప్రభాకర్, కోశాధికారి టి.లక్ష్మారావు, బాలేశ్వర్, సురేష్, రజనీ విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్షల ప్రజాధనం.. ట్యాంకుల్లో పోశారు..!

- నిరుపయోగంగా సింటెక్స్ ట్యాంకులు
- మరమ్మతులకు నోచుకోని చేతిపంపులు
- మరమ్మతులు చేస్తే తీరనున్న ప్రజల దాహార్తి



నింబోలిఅడ్డాలో నిరుపయోగంగా సింటెక్స్ ట్యాంక్, హ్యాండ్ బోర్

కాచిగూడ: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారించేందుకు గాను జలమండలి అధికారులు వేసవి కార్యచరణ ప్రణాళిక రూపొందించారు. ఇంత వరకు బాగానే ఉంది. కొన్నేళ్లుగా కాచిగూడ డివిజన్‌లో నిరుపయోగంగా ఉన్న సింటెక్స్ ట్యాంకుల గురించి విస్మరించినట్లున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులు పనికిరాకుండా ఉన్నాయి.

- కాచిగూడ, నింబోలిఅడ్డా, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులలో నీళ్లు నిండం లేదు. దీనివల్ల స్థానికులకు ఎలాంటి ఉపయోగం లేదు. ఒక వేళ ఈ ప్రాంతాలలో స్థానికంగా మంచినీటి సమస్యలు తీవ్రంగా లేకపోతే మంచినీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు తరలించడం ద్వారా ఉపయోగకరంగా ఉంటుంది.
- అధికారులు వీటి గురించి పట్టించుకోవడమే వదిలేశారు. ఫలితంగా లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులు నిరుపయోగంగా మారి స్థానికుల అవసరాలు తీర్చలేకపోతున్నాయి.
- ఈ ట్యాంకులలో సక్రమంగా నీటిని నింపడం ద్వారా స్థానికంగా తాత్కాలికంగా మంచినీటి సమస్యను పరిష్కరించవచ్చు. నీటి ట్యాంకర్లు లేని ప్రాంతాలలో ఏర్పాటు చేయడం ద్వారా స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుంది.
- కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా మంచినీళ్లు నింపుతున్నారు. ఈ ట్యాంకులు స్థానికుల అవసరాలు తీరుస్తున్నప్పటికీ నిరంతరం నింపకపోవడం వల్ల సమస్యలు తప్పడం లేదు. జలమండలి అధికారులు సింటెక్స్ ట్యాంకులపై దృష్టి సారించాల్సిన అవసరముందని స్థానికులు కోరుతున్నారు.

చూసేందుకే.. చుక్క రాల్చవు...

వేసవి ముంచుకొస్తున్నది. మంచినీటి ఎద్దడి రోజు రోజుకు తీవ్రం అవుతోంది. నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో మాత్రం జలమండలి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా రాబోయే రోజుల్లో మంచినీటి ఎద్దడి తీవ్రమయ్యే అవకాశం ముంది. చేతి పంపులు (బోరింగ్) మరమ్మతులలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం వల్ల సమస్యలు రోజురోజుకు జటిలమవుతున్నాయి.

- కాచిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో చేతి పంపులు నిరుపయోగంగా మారాయి. చాలా నెలల నుంచి ఇవి పనికి రాకుండా మారాయి. కొన్ని బోరింగ్‌లైతే భూమిలోకి కూరుకుపోయాయి. మరికొన్ని దేనికీ ఉపయోగపడకుండా తయారయ్యాయి.

దళితబంధుపై ప్రభుత్వ వైఖరి తెలపండి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

హుడాకాంప్లెక్స్: దళితబంధుపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని కోరుతూ సరూర్‌నగర్ తహసీల్దార్ కృష్ణయ్యకు దళిత సంఘాల నాయకులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ అధికారులు అన్ని విధాలుగా విచారణ చేశారన్నారు. ఎన్నికల అనంతరం ఆగిపోయిన దళితబంధుపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తేల్చాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, అరవింద్, శివకుమార్, రాము, రాకేష్, సుధ, మల్లేష్ ఉన్నారు.


శిఖం భూమిని సంరక్షించాలని వినతి

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని తారమతిపేటలో పోల్కమ్మ చెరువు శిఖం భూమిని రియల్ వ్యాపారులు ఆక్రమించుకుని రోడ్డు వేస్తున్నారని, వాటిని అడ్డుకొని సంరక్షించాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం తహసీల్దార్ రవీందర్ దత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిఖం భూమితో పాటు చెరువు నుంచి రోడ్డు వేశారని ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఆర్డీఓలకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారులతో కుమ్మక్కై అక్రమార్కులు శిఖం భూమిని ఆక్రమించుకొని రోడ్డు వేశారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన శిఖం భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు శివకుమార్, యాదయ్య, శివ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం: ఇద్దరి అరెస్టు

చంచల్‌గూడ: రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తున్న ఇద్దరిని మాదన్నపేట పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి చావణీ డివిజన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. విశ్వసనీయ సమాచారం అందుకున్న మాదన్నపేట పోలీసుల బృందం చావణీలోని మౌలానా హోటల్ వద్ద సలీమ్ జాఫర్ (75)కు చెందిన ఒక గోడౌన్‌పై దాడి చేయగా దాదాపు 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరికాయి. సలీమ్ జాఫర్‌తో పాటు మహ్మద్ ఇబ్రహీం (22) అనే మరో వ్యాపారి పోలీసులకు అక్కడ పట్టుబడ్డాడు. బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకుని ఇరువురినీ అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కాగా, మలక్‌పేట సివిల్ సప్లై అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం చేయడం వల్లే రేషన్ బియ్యం ముఠాలు తమ దందాను కొనసాగిస్తున్నాయని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుర్మగూడ, చావణీ డివిజన్లలో రేషన్ దుకాణాల్లో సివిల్ సప్లై శాఖ తనిఖీలు చేయకపోవడంతో ప్రభుత్వ రేషన్ బియ్యం దారి మళ్లుతోందని అంటున్నారు.

సౌజన్యకు జాతీయ యువజన అవార్డు



కాచిగూడ: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల నేపథ్యంలో నవభారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా అందించే జాతీయ యువజన అవార్డు–2024కు సి.హెచ్.సౌజన్యను ఎంపిక చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు బత్తుల హేమంత్ తెలిపారు. ఎనమిదేళ్లుగా ఎన్‌సీసీ, వివిధ సంస్థల నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ శాంతి, మత సామరస్యం, పర్యావరణ పరిరక్షణ, జాతీయ సమైఖ్యత, విద్యార్థుల సంక్షేమ అభివృద్ధికి సౌజన్య అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో సౌజన్యకు జాతీయ యువజన అవార్డును అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.